## బృందావన్ గార్డెన్ అభివృద్ధికి నిధులివ్వాలి

**• జాతీయ టూరిజం కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యే**



జాతీయ పర్యాటకకార్యదర్శికివినతిపత్రంఅందజేస్తున్న ఎంపీ రాములు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 6 : జూరాల ప్రాజెక్టు వద్ద బృందావన్ గార్డెన్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరుతూ నాగర్‌కర్నూల్ ఎంపీ రాములుతో కలిసి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం నేషనల్ టూరిజం కార్యదర్శి విద్యావతికి వినతిపత్రం అందజేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం రేవులపల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తున్న బృందావన్ గార్డెన్‌కు స్వదేశీదర్శన్ పథకంలో భాగంగా అభివృద్ధి పనుల నిమిత్తం మరో రూ.84 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఇందుకుగానూ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## వైభవంగా ఈదమ్మ జాతర

**• పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**



ఈదమ్మ జాతరలో సిడే నిర్వహిస్తున్న భక్తులు

పాన్‌గల్, ఫిబ్రవరి 6 : మండలకేంద్రంలో ఈనెల 6నుంచి ఈదమ్మ దేవత బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఈదమ్మ దేవత ప్రధాన ఘట్టమైన సిడే ఉత్సవాన్ని కనులపండుగగా నిర్వహించారు. ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఈదమ్మ దేవతను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సీఐ నాగభూషణ్‌రావు ఆధ్వర్యంలో 10మంది ఎస్సైలు, 90మంది పోలీసులుబందోబస్తునిర్వహించారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలకేంద్రంలోని రైతు వేదికలో పాన్‌గల్, వీపన్‌గండ్ల, చిన్నంబావి మండలాలకు చెందిన 175మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పంపిణీ చేశారు.అదేవిధంగా గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రహరీని ప్రారంభించారు. సమావేశంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సోమేశ్వరమ్మ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్‌నాయుడు, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## ఏదుల రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభం

గోపాల్‌పేట, ఫిబ్రవరి 6 : నూతనంగా ఏర్పడిన ఏదుల మండలకేంద్రంలో తాసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తాసీల్దార్ చక్రపాణి ఎంపీటీసీ నరేందర్, సుల్తాన్, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల ఇన్‌చార్జి మంద సత్యాశీలారెడ్డి, రేవల్లి మండల అధ్యక్షుడు వాడల పర్వతాలు, సింగిల్ విండో డైరెక్టర్ గోపాల్ యాదవ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేషిరెడ్డి, నరేందర్‌రెడ్డి, జానకిరాం, కృష్ణయ్య, రమేశ్, మునేశ్, లక్ష్మారెడ్డి, రవి, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

### పెబ్బేరులో సుడిగాలి పర్యటన

పెబ్బేరు, ఫిబ్రవరి 6 : వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం పెబ్బేరు మున్సిపాలిటీలో సుడిగాలి పర్యటన చేశారు. ఆయన వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఉన్నారు. రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన బాధితులను ఎమ్మెల్యే పరామర్శించి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. బస్టాండ్‌లో సీసీ బెడ్ నిర్మాణంతో పాటు ప్రయాణికులకు వసతులు కల్పిస్తానని, పీహెచ్‌సీని 30పడకల దవాఖానగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. పెబ్బేరులో కబ్జాలకు గురైన భూములను విడిపిస్తానని తెలిపారు. అలాగే, త్వరలో జరుగబోయే చౌడేశ్వరి జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, సుభాశ్ చౌరస్తా నుంచి జూరాల క్యాంప్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల స్టాఫ్ నర్సులుగా ఎంపికైన వారిని, కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషు, తాసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు , నాయకులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



సర్పంచులసన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు

ఇటిక్యాల, ఫిబ్రవరి 6: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని జెడ్పీటీసీ హన్మంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రతిమూడునెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీ పీ స్నేహ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపల్‌దిన్నె, జింకలపల్లె, ధర్మవరం బీసీకాలనీల్లో తాగునీటి సమస్య ఉందని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఏఈ వంశీసాగర్ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సహకరిస్తే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే సభలో ఆయా శాఖల అధికారులు వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రామనర్సింహ, పదవీ కాలం ముగిసిన సర్పంచులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొని సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి, తాసీల్దార్ నరేందర్, అధికారులు తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గద్వాలటౌన్, ఫిబ్రవరి 6 : విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోని వచ్చింది. జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి ఎంపీఎస్‌హెచ్‌ను సోమవారం అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ తనిఖీ చేశారు. కాగా, ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకున్నా వచ్చినట్లు రిజిస్టర్‌లో సంతకం చేసినట్లు గుర్తించిన అదనపు కలెక్టర్ విచారణ చేపట్టారు. సదరు ఉపాధ్యాయుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా మూడురోజులపాటు సెలవుపై వెళ్లినట్లుగా తేలింది. దీంతో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డీఈవో, ఎంఈవోలను ఆదేశించారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి డీఈవో ఇందిర ధ్రువీకరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-319433-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# ఇండోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలి

**• వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



అధికారులతో మాట్లాడుతున్నకలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి/వనపర్తి టౌన్, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియాన్ని ఆయన పరిశీలించారు. యువత క్రీడలు ఆడేందుకు, వ్యాయామం చేసుకునేందుకు జిమ్, బ్యాడ్మింటన్ కోసం కోర్టును ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డిని ఆదేశించారు. అంతకుముందు ఆర్డీవో కార్యాలయంలో జరుగుతున్న ఈవీఎం ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను శుభ్రం చేసి వాటిపై ఉన్న స్టిక్కర్స్ తొలగించి ఈసీఐఎల్ ఇంజినీర్ల ద్వారా ఎఫ్ఎల్‌సీ చేయించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పకడ్బందీగా ఎఫ్ఎల్‌సీ నిర్వహించాలని ఆదేశించారు. ఆయనతో పాటు రెవెన్యూ అధికారులు, అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో ఎఫ్ఎల్‌సీ కొనసాగించాలని సూచించారు. కలెక్టర్‌తోపాటు తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# జీపీలఅభివృద్ధికిసమన్వయంతోపని చేయాలి

**• జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్**

గద్వాల, ఫిబ్రవరి 6 : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గద్వాల, అలంపూర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ



అధికారులతో మాట్లాడుతున్నకలెక్టర్ సంతోష్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 255 గ్రామపంచాయతీలకు 101మంది మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని, ఈనెల రెండో తేదీన వీరు బాధ్యతలు స్వీకరించారన్నారు. ఈ నెల 7నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నిత్యం జరిగే పారిశుధ్య నిర్వహణను ప్రత్యేకాధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే గ్రామ సభలకు ప్రత్యేకాధికారులు అధ్యక్షత వహించి ఆదాయ వ్యయాలపై సమీక్ష నిర్వహించాలన్నారు. గ్రామాభివృద్ధిపై ప్రణాళిక రూపొందించి గ్రామ స్వరాజ్యపోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫిబ్రవరి 28వరకు 100శాతం ఇంటి పన్నులు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలకేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో అక్రమ వెంచర్ల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ గ్రామ పంచాయతీ ప్రధాన బాధ్యతలను వివరించారు. పంచాయతీ అధికారి పవర్‌పాయింట్ ప్రాజెక్టు ద్వారా గ్రామపంచాయతీ విధులు, అధికారుల బాధ్యతలు తదితర వాటిని వివరించారు. సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, ఉమాదేవి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు మొదటి ఉపాధ్యాయులు తల్లిదండ్రులే..

**• జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్**

కేటీదొడ్డి, ఫిబ్రవరి 6 : పిల్లలకు మొదటి ఉపాధ్యాయులు తల్లిదండ్రులేనని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్ అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి తల్లుల సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు విధిగా బడికి పంపించాలని, బడికి పంపించడమే కాకుండా వారికి మొదటి టీచర్‌గా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా పిల్లలను బడికి పంపకుండా పనుల్లోకి పంపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్లుగా సవిత, గీతలను ఎన్నుకున్నారు. అలాగే మదర్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోరమ, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్, డీసీపీవో నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 6 : జిల్లాలో ఇసుక, రేషన్ బియ్యం, మొర్రాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ రితి రాజ్ పేర్కొన్నారు. జిల్లాలో సోమవారం అర్ధరాత్రి గద్వాల రూరల్ పరిధిలో అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, అలాగే అయిజ పరిధిలో 9 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో 72 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని 6కేసులు నమోదు చేశామన్నారు. ఈ నెల నుంచి వాటిని జిల్లాలో సమూలంగా నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. ఈ బృందాలు గ్రామ స్థాయి నుంచి రహస్య సమాచారం సేకరించి అక్రమ రవాణాను ఛేదించి కేసులు నమోదు చేస్తాయన్నారు.అక్రమ రవాణా విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని, తప్పులకు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు.



మాట్లాడుతున్నఎస్పీరితిరాజ్

## పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు

పెద్దమందడి, ఫిబ్రవరి 6 : బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని , పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా నడుద్దామని మాజీ సర్పంచ్ సతీశ్ అన్నారు. మండలంలోని జంగమాయిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరం నడుచుకుందామని తీర్మానించుకున్నారు. సమావేశంలో కార్యకర్తలు కొండలు, శశివర్ధన్‌రెడ్డి ఉన్నారు.

### పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

అయిజ, ఫిబ్రవరి 6: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ భాగ్యలక్ష్మి, బాలరాజు సీఎస్, డీవోకు సూచించారు. మంగళవారం పట్టణంలోని హరిహర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్‌ను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాక్టికల్స్‌ను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ల్యాబ్‌లో ప్రాక్టికల్స్‌కు అవసరమైన సౌకర్యాల కొరతలేకుండా చూడాలన్నారు.

## పకడ్బందీగా నిర్వహించాలి

గద్వాల, ఫిబ్రవరి 6 : జిల్లాలో ఈనెల 12వ తేదీ నుంచి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతిగృహాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు అందించే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 19వ తేదీలోగా జిల్లాలోని విద్యార్థులందరికీ 100శాతం ఆల్బెండజోల్ మాత్రలు అందించి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రతి ఏడాది 19ఏండ్ల లోపు వయసు వారికి రెండుసార్లు మాత్రలు అందజేస్తామని, రెండేండ్లలోపు వారికి అరమాత్ర, రెండు నుంచి 19ఏండ్ల వయసు వారికి ఒక మాత్ర అందిస్తామని తెలిపారు. మాత్ర వేసుకునే ముందు విద్యార్థులు భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు, అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి నళిని, డాక్టర్ సిద్ధప్ప, అధికారులు శ్యాంసుందర్, ముసాయిదా బేగం పాల్గొన్నారు.

## జంతు సంరక్షణపై అవగాహన

వనపర్తి, ఫిబ్రవరి 6 : సమాజంలో ప్రతి జీవికి బతికేందుకు స్వేచ్ఛ ఉంటుందని, అందులో జంతువుల సంరక్షణ చాలా ముఖ్యమైనదని జిల్లా పశువైద్యశాఖ అధికారి మధుసూదన్ అన్నారు. మండలంలోని పెద్దగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో జంతు సంరక్షణ, హింసపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసరాల్లో వన్యప్రాణులు కనిపిస్తే వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించాలని సూచించారు. పశువులు, ఇతర జంతువులు రవాణా చేసేటప్పుడు జంతు రవాణా నిబంధనలు పాటించాలని తెలిపారు. వీధుల్లో తిరిగే కుక్కలు, పిల్లులు, ఆవులు తదితర జంతువులపై కరుణతో వ్యవహరించాలని, వాటికి ఆహారం, తాగునీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యులు ఆంజనేయులు, మల్లేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేపలపెంపకంలో నీటి నాణ్యత కీలకం



శిక్షణకు హాజరైన రైతులతో మత్స్య కళాశాల అధ్యాపక బృందం

పెబ్బేరు, ఫిబ్రవరి 6 : చేపల పెంపకంలో నీటి నాణ్యతా ప్రమాణాలు కీలకమని పెబ్బేరు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి అన్నారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కళాశాలలో మత్స్య రైతుల కోసం ఏర్పాటు చేసిన మూడురోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపల పెంపకంలో పాటించాల్సిన నీటి నాణ్యతా ప్రమాణాలు, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నీటి నాణ్యతా ప్రమాణాలపై అవగాహన ఉంటే ప్రతి రైతు మంచి దిగుబడితో పాటు..చెరువులను కాలుష్యం బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. మత్స్య కళాశాలలో ప్రత్యేక వ్యాధుల నిర్ధారణ కేంద్రం, నీటి నాణ్యత విశ్లేషణ ప్రయోగశాల ఉందని, వీటిని రైతులు ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఖగోరే దాదాసాహెబ్ త్రయంబక్ మాట్లాడుతూ మత్స్య రైతులు సాగు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలను వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, మత్స్య రైతులు పాల్గొన్నారు.

## 24న సైన్స్ టాలెంట్ టెస్ట్

అయిజ, ఫిబ్రవరి 6: జిల్లాలోని జెడ్పీహెచ్‌ఎస్, ప్రభుత్వ, కేజీబీవీ పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 24న పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో నర్సింహులు తెలిపారు. మంగళవారం బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలనే టాలెంట్ టెస్ట్‌తోపాటు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రభుత్వ, జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, శేషఫణి శర్మ పాల్గొన్నారు.

## మెకానిక్ షాపులో పాము పట్టివేత

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలోని చిట్యాల రోడ్డులో ఉన్న మెకానిక్ షాపులో మంగళవారం పెద్ద నాగుపాము కనిపించింది. దీంతో షాపు యజమాని రఫీక్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్‌కు సమాచారం ఇవ్వడంతో అతడు అక్కడికి చేరుకొని పామును బంధించాడు.

## ఘనంగా స్వయంపాలన

మదనాపురం, ఫిబ్రవరి 6 : మండలంలోని దుప్పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం హెచ్‌ఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కలెక్టర్‌గా రాణి, డీఈవోగా చరణ్‌నాయక్, హెచ్‌ఎంగా నందిని, ఎంఈవోగా ఉపేందర్ ఒక రోజు బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంవో మహానంది, సీఎంవో యుగేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వయంపరిపాలనదినోత్సవంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు

## నిందితుడికి ఆరేండ్ల జైలుశిక్ష

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 6 : గృహ హింస కేసులో నిందితుడికి ఆరేండ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్పీ రక్షితా కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆమె వివరాలు వెల్లడించారు. వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన దయ్యపు శివమ్మ, శివ భార్యాభర్తలు. 2019 సెప్టెంబర్ 26వ తేదీన ఒక మహిళ కాల్చుకుందని ఫిర్యాదు అందగా వీపనగండ్ల ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. భర్త శివ రోజు తాగివచ్చి చిత్రహింసలకు గురిచేస్తున్నాడని, ఆ బాధలు భరించలేక ఇంట్లో ఉన్న కిరోసిన్ ఒంటిపై పోసుకొని అంటించుకున్నానని శివమ్మ మరణ వాంగ్మూలాన్ని రికార్డు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులో ఈ కేసు అప్పటి నుంచి నడుస్తూ 17మంది సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య , కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి రజిని నిందితుడికి 6 ఏండ్ల జైలుశిక్ష , రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని ఆమె తెలిపారు. నిందితుడికి శిక్ష పడడంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్, పీపీ బాలయ్య, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ కృషిని ఎస్పీ అభినందించారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి..

అలంపూర్, ఫిబ్రవరి 6: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో అలంపూర్ జడ్జి కవిత ఒక్కొక్కరికీ రూ.2వేల జరిమానాతోపాటు జైలు శిక్ష విధించారు. అలంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన షేక్ ఇక్బాల్, బాలకృష్ణకు రూ.2వేల జరి మానాతోపాటు రెండు రోజుల జైలుశిక్ష, బోయ నర్సింహులుకు రూ.2వేల జరిమానాతోపాటు మూడు రోజులు, కుర్వ మద్దిలేటికి జరిమానాతోపాటు నాలుగురోజులు, జ్ఞానేంద్రుడికి జరిమానాతోపాటు ఏడురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

గట్టు, ఫిబ్రవరి 6 : మండలంలోని బలిగేర చెక్‌పోస్ట్ వద్ద కర్ణాటక మద్యాన్ని గట్టు పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు విశ్వసనీయ సమాచారం మేరకు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేయగా ఓ కారులో మద్యం కార్టన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని ఎరిగేర, లింగన్ ఖాన్‌దొడ్డికి చెందిన సుదర్శన్, రాజుగౌడ్, నరేశ్‌గౌడ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా ఎరిగేరలోని వందన బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్ వెంకటేశ్ సూచన మేరకు తాము మద్యం కార్టన్లను కర్నూలుకు తరలించేందుకు సమాయత్తమయ్యామని వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్పష్టంచేశారు. కాగా పోలీసులు స్వాధీనం చేసుకున్న 20 కార్టన్ల మద్యం విలువ రూ.76,800 ఉంటుందని తెలిపారు.

## అప్రమత్తంగా ఉండాలి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 6 : మండలకేంద్రంతోపాటు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో చిరుత పులి సంచరిస్తుందని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని మాజీ సర్పంచ్ వెంకటరమణ మంగళవారం సూచించారు. ఖిల్లాఘణపురం గ్రామ శివారులో సోమవారం ఉదయం చంద్రాయుడు ఉన్న గుట్ట ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు కొందరు గుర్తించారని, అటు నుంచి పర్వతాపూర్ రోడ్డు పక్కన ఉన్న గుట్ట ప్రాంతంలో చిరుత పులిని గ్రామస్తులు చూసినట్లు సమాచారం ఇచ్చారని చెప్పారు. ప్రజలు గుట్టల ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని, మేకలు, పశువుల కాపరులు, గుట్టల ప్రాంతంలో వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వ అధికారులు చిరుతపులిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకు అధికారులకు అందరం సహకరిద్దామని సూచించారు.

## విద్యార్థులకు నగదు పురస్కారం

అయిజ, ఫిబ్రవరి 6: మండలంలోని ఉప్పల జెడ్పీహెచ్‌ఎస్‌లో గతేడాది పదో తరగతిలో 1, 2, 3 గ్రేడ్లు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేశారు. లీలావతి జ్ఞాపకార్థం ఆమె తనయుడు శ్రీధరాచారి తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో మొదటి మూడు గ్రేడ్లు సాధించిన ఆరుగురు విద్యార్థులకు రూ.25వేల నగదును మంగళవారం అందజేశారు. ఉత్తమ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తన తల్లి జ్ఞాపకార్థం ఆర్థికంగా చేయూతనందించేందుకు ఏటా నగదు పురస్కారం అందజేస్తున్నట్లు శ్రీధరాచారి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహులు, ఎస్‌ఎంసీ చైర్మన్ మాధవాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమస్యలపై పోస్టుకార్డు ఉద్యమం

కొత్తకోట, ఫిబ్రవరి 6 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను స్వయంగా విద్యార్థులే సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డు ద్వారా తెలిపే విధంగా పోస్టుకార్డు ఉద్యమాన్ని డయల్ యువర్ విలేజ్ అనే ఎన్ఆర్ఐ సంస్థ నిర్వహిస్తున్నది. అందులో భాగంగా మంగళవారం కొత్తకోటలోని ప్రభుత్వ పాఠశాలలో జేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు సీఎంకు పోస్టు కార్డు ద్వారా వారి సమస్యలను తెలిపారు. సరైన తరగతి గదులు, మరుగుదొడ్లు లేకపోవడం, గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్, తాగునీరు వంటి మౌలిక వసతులు లేవని విద్యార్థులు పోస్టుకార్డులో రాసి సీఎం చిరునామాకు పంపుతూ తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

## పూర్వ విద్యార్థుల సహకారం అమూల్యమైనది

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 6 : పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహకారం అమూల్యమైనదిగా హరిజన్‌వాడ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హరిజనవాడ ఉన్నత పాఠశాలలో 1999–2000 ఏడాదిలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాలకు మైక్‌సెట్ సౌండ్ సిస్టంను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాలకు కావాల్సిన వనరులను గుర్తించి రూ.20వేల విలువ చేసే మైక్ సెట్ సౌండ్ సిస్టంను సమకూర్చడం అభినందనీయమన్నారు. అదేవిధంగా పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు కూడా అందిచండం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జనజ్వాల, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, గాయకుడు సత్తార్, గంధం నాగరాజు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు స్వాతి, మహ్మద్, ఆరీఫ్, నవీన్, అబుబాకర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.